ప్రజాశక్తి
గురువారం 31 అక్టోబర్ 2024
5
శ్రీ సత్యసాయి

అన్నింటినీ కరువు మండలాలుగా ప్రకటించాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

శ్రీ సత్య సాయి జిల్లాలో 32 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బడాసుబ్బిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 32 మండలాలు ఉంటే ప్రభుత్వం పది మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించడం అన్యాయమన్నారు. పంటకోత దశలో అతివృష్టి కారణంగా రైతులు నష్టాల పాలయ్యారన్నారు. కేవలం మండల వర్షపాతం నమోదు ఆధారంగా గుర్తించి కరువు మండలాలుగా కాకుండా శాస్త్రీయ పద్ధతిలో గ్రామాలను యూనిట్ గా తీసుకొని అక్కడి వర్షాధారంగా కరువును గుర్తించాలని డిమాండ్ చేశారు.

నల్లచెరువు : నల్లచెరువు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని లో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు శ్రీరాములు, సిపిఎం మండల కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. వర్ష పాతం కాకుండా పంట దిగుబడి చూసి కరువు మండలాలుగా ప్రకటించాలని ప్రభుత్వానికి సూచించారు. సత్యసాయి జిల్లా లోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు 'అపార్' కష్టాలు..!

విద్యార్థులు ప్రతి ఒక్కరి గుర్తింపు కోరుతూ అపార్ కార్డ్(ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం విద్యార్థులు, తల్లిదండ్రులను ఇక్కట్లపాలు జేస్తోంది. స్కూల్ రికార్డ్ (యుడైస్ ప్లస్)లోని వివరాలతో ఆధార్‌కార్డులో నమోదైన వివరాలు సక్రమంగా పోలి ఉంటేనే అపార్ కార్డు వస్తుంది. ఈ రెండింటిలో చిన్నపాటి తేడా ఉన్నా 12 అంకెల అపార్ కార్డు వచ్చే అవకాశం ఏమాత్రం లేదు. దీంతో ఆధార్, స్కూల్ రికార్డుల్లో ఉన్న వివరాల్లో ఎక్కడ తేడా ఉందో తెలుసుకునేందుకు అటు ఉపాధ్యాయులు, ఇటు తల్లిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు.

ప్రజాశక్తి-గుత్తి

గుత్తిలో ఆధార్ కేంద్రంలో వివరాలు నమోదు చేసుకుంటున్న విద్యార్థులు

- స్కూల్, ఆధార్‌లో ఒకే రకమైన వివరాలుండాలి
- చిన్నపాటి తప్పున్నా నమోదుకు అవకాశం లేనట్లే
- తప్పులు సరిచేసుకునేందుకు అవస్థలు
- కార్యాలయాలు, ఆధార్ కేంద్రాల వద్ద పడిగాపులు
- పేద విద్యార్థులపై ఆర్థిక భారం

చిన్నపాటి తేడా ఉన్నా సమస్యే..

అపార్ పొందేందుకు ఆధార్, స్కూల్ రికార్డుల్లో చిన్నా తేడా ఉన్నా ఆన్‌లైన్‌లో వివరాలు తీసుకోవడం లేదు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల వివరాలు నమోదు చేయడం కోసం ఆధార్, స్కూల్ రికార్డు (యుడైస్ ప్లస్)లో పుట్టిన తేదీ, పేరు, ఇంటి పేర్లు, తండ్రి పేరు, కామా, స్పేస్ ఇలా అన్ని వివరాలు ఒక్క అక్షరం తేడా లేకుండా అన్నింటిలోనూ ఒకే విధంగా ఉండాలనేది అపార్ నిబంధన. ఈ నిబంధన విద్యార్థులు, తల్లిదండ్రులకు సమస్యలను తెచ్చిపెడుతోంది. ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలు, స్కూల్ రిజిస్టర్లలో ఒకే విధమైన వివరాలు లేకపోవడంతో చాలా మంది వాటి సవరణ కోసం అవస్థలు పడుతున్నారు. ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలు సరిచేసుకుని తీసుకురావాలని పాఠశాల, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు విద్యార్థులకు చెబుతున్నారు. జననధ్రువీకరణ పత్రం కోసం గ్రామ సచివాలయాలు, ఆసుపత్రులు, మున్సిపాల్టీలు, తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఆధార్‌లో మార్పుల కోసం ఆధార్ కేంద్రాలకు వెళ _న్నారు. స్కూల్ రికార్డుల్లో తప్పులుంటే (యుడైస్ ప్లస్) సరిచేసేందుకు సంబంధిత ఎంఇఒ కార్యాలయాల్లో ఓ ఫారాన్ని ఇస్తున్నారు. అక్కడ ఈ వివరాలను సరి చేసి పంపుతున్నారు. అయితే ఆధార్, జనన ధ్రువీకరణ పత్రంలో మార్పుల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయకతప్పడం లేదు.

పేదలపై ఆర్థిక భారం

ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాల్లో తప్పులు సరి చేసుకునేందుకు పలు పత్రాలను సమర్పించాల్సి ఉంది. లాయర్ నోటరీ, సంబంధిత వివరాలను తెలియజేసే జిరాక్స్ పత్రాలను తీసుకుని మీసేవా, ఆధార్ కేంద్రంకు విద్యార్థులు వారి తల్లిదండ్రులు క్యూ కడుతున్నారు. వీటిని సరి చేసుకునేందుకు పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు అవుతుండడంతో పేద తల్లిదండ్రులు జేబులకు చిల్లులు పడుతున్నాయి.

మీసేవా కేంద్రం వద్ద తల్లిదండ్రులు, విద్యార్థుల పడిగాపులు

ప్రయివేటు నిర్లక్ష్యం

అపార్ నమోదు విషయంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు దృష్టి సారించారు. ఇప్పటికే ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు ఈ విషయాన్ని తెలియజేసి ఆధార్ కార్డుల్లో ఏవైనా తప్పులుంటే సరి చేసుకోవాలని చెబుతున్నారు. అయితే ప్రయివేటు పాఠశాలల్లో ఈ పరిస్థితి కన్పించడం లేదు. ఈ విషయం తమకు సంబంధం లేని అంశంగా ప్రయివేటు యాజమాన్యాలు భావించి తేలిగ్గా తీసుకుంటున్నట్లు అపార్ గణాంకాలు చెబుతున్నాయి. అపార్ నమోదును వేగవంతంగా చేయాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా ప్రయివేటు యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు.

నిబంధనల అడ్డంకి..

18 ఏళ్ల లోపు విద్యార్థులకు ఆధార్‌కార్డులో పుట్టిన రోజుకు సంబంధించి చేర్పులు మార్పులు చేయాలంటే తప్పనిసరిగా జనన ధ్రువీకరణ పత్రం ఉండాలనే నిబంధన ఉంది. 18 ఏళ్లు దాటిన వారికి పదవ తరగతి ఒరిజినల్ మార్క్స్ మెమో ఉంటే సరిపోతుందని ఆధార్ కేంద్రం నిర్వాహకులు చెబుతున్నారు. ఆసుపత్రుల్లో ప్రసవం అయితే పిల్లల తల్లిదండ్రుల పేర్లు, ఆధార్ నెంబర్లు నమోదై ఉంటాయి. ఇంటి వద్ద ప్రసవం అయిన వారికి ఏరకమైనా రికార్డులు నమోదు అయ్యే పరిస్థితి ఉండదు. ఇలాంటి వారంతా పురపాలక సంఘం కార్యాలయంలో పేర్లు నమోదు చేయాల్సి ఉంటుంది. పిల్లలు పుట్టిన 15 ఏళ్ల లోపు పేర్లు నమోదు చేయలేకపోతే జనన ధ్రువీకరణ పత్రం ఇచ్చేందుకు వీలులేదని ప్రభుత్వ జీవో ఉందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. గతంలో 15 ఏళ్ల పేర్లు నమోదు చేయకుండా ఉన్నవారు ప్రస్తుతం సర్టిఫికెట్ కోసం మున్సిపల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ప్రభుత్వాలు స్పందించాలి

అపార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఆధార్ కేంద్రాల్లో కంప్యూటర్ ఆపరేటర్లు, పాఠశాల, కళాశాలల్లో సిబ్బంది చేసిన తప్పుల వల్ల ప్రస్తుతం విద్యార్థులు, తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి నిబంధనల వెసులుబాటు కల్పించాలి. అన్ని ప్రాంతాల్లోనూ అదనపు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలి.

సి.రమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు.

అ'ధర'హో

దీపావళి పండుగ సందర్భంగా టపాసుల ధర అ'ధర'హో అనేలా ఉంది. టపాసులు పేలిస్తే కాదు.. వాటిని కొంటుంటేనే కళ్లు బైర్లు కమ్ముకునే పరిస్థితి కన్పిస్తోంది. దీపావళి పండుగ అంటే టపాసులు కాల్చడానికి అందరూ ఉత్సాహం చూపుతారు. ఇదే అదునుగా భావించిన పలువురు విక్రయదారులు నిబంధనలు పాటించకుండా, ధరలకు నియంత్రణ లేకుండా ఇష్టారాజ్యంగా టపాసులు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. విక్రయ కేంద్రాల వద్ద నిబంధనలకు పాతరవేసి ఇష్టమొచ్చిన రీతిలో విక్రయాలు సాగిస్తున్నారు.

- పేలుతున్న టపాసుల ధరలు
- కొనలేక సామాన్యులు విలవిల
- అమ్మకాల్లో నిబంధనలకు పాతర
- మామూళ్లతో సరి పెట్టుకున్న అధికారులు

ప్రజాశక్తి-హిందూపురం

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది దీపావళి మందుగుండు సామగ్రి ధరలు 20 నుంచి 30 శాతం పెరిగాయి. మందుగుండు సామగ్రి తయారీ ఫ్యాక్టరీల యాజమాన్యాలు గతేడాది కన్నా ఈసారి 10 శాతం వరకు ధరలు పెంచాయని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో సుమారు రూ.2 వేలతో టపాసులు కొనగా ఇప్పుడు అవే కొనాలంటే రూ.3వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. వీటి ధరలు పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఒక పక్క వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు పండించిన పంటలు చేతికి రాకపోవడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి పరిస్థితుల్లో పండుగ పూటైనా పిల్లలు కోరిన విధంగా టపాసులు కొనిద్దామనుకున్నా నింగినతాకిన వాటి ధరలను చూసి పేదలు దిక్కులు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

నిబంధనలకు పాతర

హిందూపురంలో ప్రతి ఏడాది మాదిరే ఈసారి కూడా ఎంజిఎం మైదానంలో మంగళవారం నుంచి దీపావళి టపాసుల అమ్మకాలు ప్రారంభించారు. నిబంధనల మేరకు ఎంజిఎం మైదానంలో వ్యాపారులకు అనుమతులు ఇవ్వడానికి లేదు. అధికారులకు మాముళ్లు ఇస్తే ఊరి మధ్యలోనే కాదు అవసరమైతే పెట్రోల్ బంక్ వద్ద సైతం ఇస్తాం అన్న చందంగా వారి వ్యవహారం కన్పిస్తోంది. టపాసుల వ్యాపారాలు ప్రారంభం అయిన అనంతరం పరిశీలన చేయాల్సిన అయా శాఖల అధికారులు అటు వైపు కన్నెత్తి చూడక పోవడంతో విక్రయదారులు విపరీతంగా ధరలు పెంచి సామాన్యులను అడ్డంగా దోచుకున్నారు. కొనుగోలుపై వ్యాపారులు బిల్లులు ఇస్తున్నారా...? లేదా అని పరిశీలన చేసి, బిల్లులు ఇవ్వని వారిపై కేసులను నమోదు చేయాల్సిన వాణిజ్య శాఖ అధికారులు కూడా మామూళ్ల మత్తులో అటువైపు కన్నెత్తి చూడడం లేదు. రూ.కోట్లలో జరిగే వ్యాపార లావాదేవీల్లో పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని పలువురు వాపోతున్నారు. తూనికలు కొలత శాఖ అధికారులు నిర్దేశించిన ధరలకు అనుగుణంగా అమ్మకాలు చేస్తున్నారా...? లేదా అని చూసి ఎక్కువ ధరలకు విక్రయించిన వారిపై కేసులు నమోదు చేయాల్సి ఉన్నప్పటికి వారు సైతం అటు వైపు చూడడంలేదు. ఇక ఇతర నిబంధనలను పరిశీలన చేయాల్సిన అగ్నిమాపక, రెవెన్యూ శాఖల అధికారుల వ్యవహారం కూడా నిర్లక్ష్యంగానే కన్పిస్తోంది.

గతంతో పోల్చితే 20 నుంచి 30 శాతం పెంపు

బాణసంచా ధరలు గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం 20 నుంచి 30 శాతం మేర పెరిగాయి. సాధారణంగా దీపావళి ముందురోజు 60 నుంచి 70 శాతం, పండగ రోజు మిగిలిన 30-40 శాతం విక్రయాలు జరుగుతాయి. ఈ ఏడాది ధరల వల్ల బుధవారం ఆశించిన స్థాయిలో అమ్మకాలు సాగలేదు. రాత్రి వరకు 30 నుంచి 40 శాతం మేర మాత్రమే విక్రయాలు జరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. దీపావళిలో ఎక్కువగా పిల్లలు ఇష్టపడి కాల్చే కాకరపువ్వొత్తులు సాధారణ బాక్స్ ధర మంచి కంపెనీ అయితే రూ.90 నుంచి రూ.110 ఉంది. గత ఏడాది రూ.60 నుంచి 70 ఉండేది. చిచ్చుబుడ్డులు చిన్నవి పది ఉండే చిన్న బాక్స్ రూ.60 నుంచి 80 ఉంది. గతేడాది రూ.40 నుంచి 60 మధ్య ఉండేది. అదే పెద్దవి అయితే మంచి కంపెనీ రూ.300 వరకు పలుకుతోంది. తాళ్లు చిన్న పెట్టె రూ.40, పెద్దవి రూ.80, సీమటపాసులు చిన్నది బాక్స్ రూ.50 పలుకుతోంది. భూ చక్రాలు గతేడాది రూ.70 నుంచి రూ.80 ఉండేది. ఇప్పుడు రూ.100 నుంచి రూ.120 దాకా ఉంది. 5000 వాలా బాంబు దండ గతంలో రూ.1200 నుంచి రూ.1300 ఉండేది. ఇప్పుడది రూ.1500 నుంచి రూ 1800 పలుకుతోంది. 1000 వాలా మంచి రకం గతంలో రూ.2 వేలు ఉండేది. ఇప్పుడు రూ.2500 ఉంది. ఇందులో సాదారణ రకం రూ.1800 ఉంది. ఇలా అన్ని రకాల ధరలు 20 నుంచి 30 శాతం వరకు పెరిగాయి.

హిందూపురంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణం

భారీగా పెరిగాయి

గత ఏడాది రూ.1500 పెడితే పెద్ద కవర్ నిండా టపాసులు వచ్చాయి. ఈ ఏడాది అదే కవర్ నిండడానికి రూ.3,500 అయింది. ధరలు విన్న తరువాత సామగ్రి కొనుగోలు చేయకూడదని భావించా. పిల్లల ఒత్తిడితో కొనాల్సి వచ్చింది. పెరిగిన ధరల నుంచి ప్రజలు దష్టిని మరల్చేందుకు వ్యాపారులు 70 శాతం, 80 శాతం ఆఫర్లు అంటూ ఊదర గొడుతున్నారు. కానీ వారికి కావాల్సిన లాభాలను అందులోనే వసూలు చేస్తున్నారు.

రవి, కొనుగోలుదారుడు, హిందూపురం.

పకడ్బందీగా సత్యసాయి జయంత్యుత్సవాలు

కలెక్టర్ టిఎస్ చేతన్, ఎమ్మెల్యే పల్లె సింధూర

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలను అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ టిఎస్ చేతన్, ఎమ్మెల్యే సింధూర రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సత్య సాయి బాబా 99వ జయంతి ఉత్సవాలకు సంబందించి ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఎల్ విజయ సారధి, అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, ట్రస్ట్ ప్రతినిధులతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలను పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. నవంబర్ నెల 15, 16 తేదీల్లోగా ఈ పనులు పూర్తి చేయాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పక్కా ప్రణాళికతో పనులు చేపట్టాలన్నారు. ముఖ్యంగా పుట్టపర్తికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, మందిరం తదితరచోట్ల ఆర్టీసీ శాఖ ఆధ్వర్యంలో హెల్ప్ డెస్కు ఏర్పాటు చేసి సమీక్షించాలని సూచించారు. శానిటేషన్‌లో జాగ్రత్త పడాలన్నారు. వీలైతే కమిషనర్ మాట్లాడి ఇతర ప్రాంతాల్లో ఉండే మున్సిపల్ సిబ్బంది, స్థానిక పంచాయతీ సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. పట్టణం అంతా పలుమార్లు ఫాగింగ్ చేయించడం, వర్షపు నీళ్ల నిలువ లేకుండా చూడటం, అప్రోచ్ రోడ్లు, ఇంటర్నల్ రోడ్ల మరమ్మతు పూర్తి చేయడం లాంటివి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. శాశ్వత మరుగుదొడ్లు చాలకుంటే తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. జయంతి వేడుకలకు హాజరయ్యే భక్తులకు ఇబ్బంది లేకుండా భోజన ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులు ఎవరైనా అన్న దానం చేయడానికి ముందుకు వస్తే తగిన జాగ్ర త్తలు తీసుకోవాలన్నారు. చిత్రావతి నిండుకుండలా ఉండటంతో భక్తులు లోపలకు దిగకుండా చర్యలు చేపట్టాలన్నారు. చిత్రావతిలో పర్యాటకులు బోట్లలో విహరించే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. తర్ఫీదు పొందిన గజ ఈతగాళ్లను కూడా సిద్ధంగా ఉంచాలన్నారు. ఎయిర్ పోర్టు నుండి, పుట్టపర్తి వరకు అక్కడక్కడ ముళ్ళ కంపలు తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జయంతి ఉత్సవాలకు పుట్టపర్తి ఆర్డీవోను నోడల్ ఆఫీసర్ గా నియమించడం జరుగుతుందని, కలెక్టరేట్లోనూ, పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయంలోనూ ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపాలిటీ, పంచాయతీరాజ్ అధికారులందరూ కలిసికట్టుగా పనిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 24 వరకూ సత్యసాయి జయంతి వేడుకలను విజయవంతం చేయడానికి ప్రభుత్వ యంత్రాంగం పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. స్థానికంగా ఉన్న హోటళ్లు, లాడ్జీలు, షాపుల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి తగిన జాగ్రత్తలు తీసుకునేలా చూడాలన్నారు. ప్రశాంతి నిలయంలోనికి ఎలాంటి మాదక ద్రవ్యాలు వాడకం లేకుండా చూడాలన్నారు. 104, 108 వాహనాలను సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రతిరోజూ పారిశుధ్య పనులు, అవసరమైనచోట బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ట్రస్ట్ సభ్యులు చలం మాట్లాడుతూ 18 తేదీ నుండి 24 తేదీ వరకు ప్రతిరోజు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు, సుమారు 20వేల వరకు భక్తులు రావచ్చని తెలిపారు. అందరి సహకారంతో జయంతి ఉత్సవాలు విజయవంతం చేయడం జరుగుతుందని తెలిపారు. 18 తేదీన ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 19 తేదీన కుల్వంత్ హాలు నందు ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని, 20, 21 తేదీలలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. 22వ తేదీన కాన్వకేషన్ కార్యక్రమంలో సైంటిస్ట్ సేతురామన్ పాల్గొంటారని తెలిపారు. 23 తేదీన బాబా పుట్టినరోజు సందర్భంగా మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, ట్రస్ట్ ప్రతినిధులు సీవీ వాసుదేవన్, కోటీశ్వరరావు, చలం, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కనకాంబరాలతో కాసులు

ప్రజాశక్తి - బత్తలపల్లి

మార్కెట్‌లో కనకాంబరాలు చూపుతున్న రైతులు

కనకాంబరాలు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. కనకాంబరాలకు బుధవారం మార్కెట్లో మంచి ధర పలికింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.. గురువారం, శుక్రవారం రెండు రోజులు పాటు దీపావళి పండుగ ఉండడంతో మార్కెట్లో కనకాంబరాలకు ధర బాగా ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. బుధవారం బత్తలపల్లి పూల మార్కెట్లో తొలుత కనకాంబరాలు కేజీ రూ.వెయ్యి పలికింది. పూలు రావడం తగ్గడంతో చివరికి రూ.1500ల ధర పలికింది. మాములు రోజుల్లో కేజీ పూలు రూ.200 నుంచి రూ.300లుండేవి. బుధవారం ధర అధికంగా పలకడంతో రైతుల్లో ఆనందం కనిపించింది. దీపావళి పండుగ రెండు రోజులు పాటు రావడంతో పూలకు ధర పలికినట్లు వ్యాపారులు పురంశెట్టి రవి, బెస్త వెంకటస్వామి తెలిపారు.

భారత జట్టుకు ఆడాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

స్థానిక సాధన స్కూల్‌లో చదువుతున్న క్రికెట్ క్రీడాకారిణి తేజస్వినిని బుధవారం ఘనంగా సన్మానించారు. కదిరి అటవీశాఖలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ గా పనిచేయుచున్న నరసింహమూర్తి కుమార్తె తేజస్విని ఇటీవల నెల్లూరు జిల్లా వెంకటగిరి లో జరిగిన అండర్ 15 జోన్ క్రికెట్ మ్యాచ్‌లో అత్యధిక వికెట్లు సాధించి, అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. క్రీడాకారిణి క్రీడా స్ఫూర్తిని గ్రహించి మరింత ముందుకు వెళ్లిలా సహకారం అందించే ఉద్దేశంతో హరిత నేస్తం వ్యవస్థాపకుడు రాయసం హరిప్రసాద్ ఆధ్వర్యంలో కదిరి అటవీ క్షేత్రాధికారి గుర్రప్ప చేతుల మీదుగా క్రీడాకారిణి తేజస్వినిని, కోచ్ నజీర్‌ను బుధవారం సన్మానించారు. ఈసందర్భంగా ఆమెను క్రికెట్ కిట్‌ను అందజేశారు. అనంతరం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గుర్రప్ప మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని అన్నారు. మానసిక ఒత్తిడిని ఎదుర్కొనడానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని తెలిపారు. హరిత నేస్తం వ్యవస్థాపకుడు రాయసం హరిప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ఏదో ఒక రంగంలో ప్రతిభ కలిగి ఉంటారని దానిని తల్లిదండ్రులు గుర్తించి వారిని ప్రోత్సహించి తోడ్పాటు అందించాలన్నారు. దీంతో వారు ఉత్తమ క్రీడాకారులుగా ఎదుగుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రామచంద్ర నాయక్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు రామచంద్రారెడ్డి, దామోదర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

తేజస్వనికి క్రికెట్ కిట్ అందజేస్తున్న దృశ్యం

రాష్ట్రస్థాయి పోటీలకు 'జీవనజ్యోతి' విద్యార్థులు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

జిల్లాలో ఈ నెల 28న ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ధర్మవరం పట్టణంలోని జీవన్ జ్యోతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి అండర్ 17 టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెడ్మాస్టర్ సుజాత తెలిపారు. 9వ తరగతి చదువుతున్న సి.వైష్ణవి, 8వ తరగతి చదువుతున్న ఎస్. ఐశ్వర్య టేబుల్ టెన్నిస్‌లో రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఎంపికైన విద్యార్థినులు నవంబర్ మూడవ తేదీ నుంచి 5వ తేదీ వరకు కర్నూలు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ముగిసిన రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

విజేతలతో టోర్నీ నిర్వాహకులు

ప్రజాశక్తి - లేపాక్షి

మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న అండర్ 14 చెస్ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ముగిసాయి. 13 జిల్లాల నుండి దాదాపుగా 130 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. మొదటి విభాగంలో జరిగిన పోటీల్లో బాలురు విభాగంలో నెల్లూరు జిల్లా మొదటి స్థానం కష్ణాజిల్లా రెండవ స్థానం వెస్ట్ గోదావరి జిల్లా మూడో స్థానంలో నిలిచాయి. అలాగే బాలికల విభాగంలో విశాఖపట్నం మొదటి స్థానంలో అనంతపురం రెండవ స్థానంలో వెస్ట్ గోదావరి మూడో స్థానంలో నిలిచాయి. రెండవ విభాగంలో నిర్వహించిన పోటీల్లో బాలికలు విభాగంలో చిత్తూరు జిల్లా మొదటి స్థానం, గుంటూరు జిల్లా రెండవ స్థానం,వెస్ట్ గోదావరి మూడో స్థానం, విశాఖపట్నం నాలుగవ స్థానం, కడప జిల్లా 5వ స్థానంలో నిలిచాయి. అలాగే బాలుర విభాగంలో కష్ణా జిల్లా మొదటి స్థానం, గుంటూరు జిల్లా రెండవ స్థానం, నెల్లూరు జిల్లా మూడో స్థానం, అనంతపురం జిల్లా నాలుగో స్థానంలో, ఈస్ట్ గోదావరి ఐదో స్థానంలో నిలిచాయి. వీరందరు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నాగరాజ్, మొరార్జీ యాదవ్, శివకుమార్, వెంకటేష్, రామకృష్ణ,ఉదయ్ కుమార్ నాయుడు తదితరులతో పాటు వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'కార్పొరేట్' పేరుతో దోపిడీ

కదిరిలోని శ్రీచైతన్య పాఠశాల

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టంలోని చైతన్య పాఠశాల పేరుకే కార్పొరేట్ అని విద్యాబోధన మాత్రం నాశిరకంగా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. 2024-25 విద్యాసంవత్సరములో కదిరి పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం నిబంధనలకు నీళ్లొదిలిందని విద్యార్థిసంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. కరువు జిల్లాలో కార్పొరేట్ ఉన్నత విద్యా ప్రమాణాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తూ నాశిరకం విద్యను అందిస్తూ నిట్ట నిలువునా దోపిడీకి పాల్పడుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నత శ్రేణి ఉపాధ్యాయులు, టెక్నో, ఈ టెక్నో, జనరల్, ఒలంపియాడ్ అంటూ రకరకాల పేర్లతో విద్యా ప్రమాణాలను తుంగలో తొక్కి నయా దందాకు తెరలేపి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విద్య హక్కు చట్టం నిబంధనల ఉల్లంఘించి ఎల్‌కెజి, యుకెజిల నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా అడ్మిషన్లు కొనసాగించి విద్యార్థులను చేర్పించుకుంటున్నారన్న విమర్శలున్నాయి. చైతన్య పాఠశాల యాజమాన్యం ధన దాహానికి నేడు విద్యార్థులకు ప్రభుత్వ పథకాలు వర్తించవన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎలాంటి అనుమతి లేకుండా ఎల్‌కెజి, యుకెజి నిర్వహిస్తున్న చైతన్య పాఠశాల విద్యార్థులకు తల్లికి వందనం వర్తించదన్న అనుమానాలు విద్యార్థుల తల్లిదండ్రులులో నెలకొన్నాయి. యాజమాన్యం విద్యార్థులకు నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నా సంబంధిత విద్యాశాఖాధికారులు తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరించడంపై కూడా ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

శ్రీ చైతన్య పాఠశాలలో ఇష్టారాజ్యం

కదిరి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ చైతన్య కార్పొరేటు స్కూల్ యాజమాన్యం నిబంధనలకు పాతరేసిందన్న విమర్శలు ఉన్నాయి. ఎలాంటి ఉన్నత శ్రేణి విద్యార్హత లేని ఉపాధ్యాయులుతో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల యాజమాన్యంపై పలుమార్లు విద్యాశాఖాధి కారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదని దీంతో పాఠశాల యాజమాన్యం ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందని విద్యార్థిసంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా భారీ మొత్తంలో ఫీజును నిర్ణయించి తల్లితండ్రుల నుండి నిర్దాక్షిణ్యంగా ముక్కుపిండి ముందస్తుగానే వసూలు చేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలకు నీళ్లు
ఎల్‌కెజి, యుకెజిలకు లేని అనుమతి
వర్తించని ప్రభుత్వ పథకాలు

కనిపించని నోటీసు బోర్డు

తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలని కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థల వైపు మొగ్గుచూపుతున్నారు. దీని ఆసరాగా తీసుకున్న కార్పొరేట్, ప్రయివేటు స్కూళ్ల యాజమాన్యాలు నిబంధనలకు నీళ్లొదిలేశాయి. నిబంధనల ప్రకారం పాఠశాలల్లో తాము వసూలు చేసే ఫీజు వివరాలను తరగతుల వారీగా నోటీసు బోర్డులో ప్రదర్శించాలి. కానీ ఈ నిబంధనలు అమలవుతున్న దాఖలాలు కనిపించడం లేదు.

తల్లికి వందనం వర్తించనట్లేనా?

ప్రభుత్వ నిబంధనలకు పాటించని కదిరి పట్టణంలోని చైతన్య పాఠశాల యాజమాన్యం చర్యల వల్ల వారి పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు 24- 25 విద్యాసంవత్సరంలో ప్రభుత్వం నుండి అందే సాయం తల్లికి వందనం వర్తించనదన్న సందేహం తల్లితండ్రులలో నెలకొంది.

మొద్దు నిద్రలో విద్యాశాఖ అధికారులు

కరువుకు నిలయం మైన కదిరి ప్రాంతంలో చైతన్య కార్పొరేట్ పాఠశాల యాజమాన్యం విద్యా దందాకు పాల్పడుతున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నత అధికారులు స్పందించి నిబంధనలు పాటించని కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కదిరి పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలకు ఎల్‌కెజి, యుకెజి నిర్వహణకు అనుమతులు లేకున్నా యథేచ్ఛగా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి ఈ ఏడాది అగమ్యగోచరంగా తయారైంది. ఇప్పటికైనా జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి.

బాబ్జాన్,
ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు

వార్డుల పర్యటన

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం మున్సిపాలిటీలోని 28వ వార్డు లో మంత్రి కార్యాలయం ఇన్‌ఛార్జి హరీష్ బాబుతో కలసి మున్సిపల్ కమిషనర్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు తమ సమస్యలను వారికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో డోలా రాజారెడ్డి, నరసింహులు, లాయర్ మహేష్, కుమ్మరి చంద్ర, ఆదిరెడ్డి, రమేష్, కరెంటు లచ్చి, భేటీ నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య గణనపై శిక్షణ

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

నైపుణ్య గణన పై సచివాలయ సిబ్బందికి నగర పంచాయతీ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని కమిషనర్ జి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నైపుణ్య గణన సర్వే పై అవగాహన పెంచుకోవాలన్నారు.

విద్య ఆవశ్యకతపై అవగాహన

గోరంట్ల : పట్టణంలో గిరిజన బాలికల పాఠశాలలో విద్యార్థుల భద్రత విద్య యొక్క ఆవశ్యకత పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు ఈ కార్యక్రమంలో సిఐ శేఖర్ మాట్లాడుతూ విద్య విలువలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడీవో నరేంద్ర కుమార్, ప్రిన్సిపల్ విజయ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

సింహ గర్జనను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

అనంతపురంలో డిసెంబర్ 14వ తేదీన జరిగే మాలల సింహ గర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని మాల మహానాడు వ్యవస్థాపకులు మల్లెల వెంకటరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన బుధవారం హిందూపురంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ క్రీమి లేయర్ చేయాలని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే డిసెంబర్ 14న మాలల సింహగర్జన సభను నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సింహగర్జనకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

పశుగణన పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి - ముదిగుబ్బ

21వ అఖిలభారత పశుగణన పోస్టర్లను మండల కేంద్రంలోని ప్రభుత్వ పశువుల వైద్యశాలలో ఎంపిపి గొడ్డు మర్రి ఆదినారాయణ యాదవ్ బుధవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుగణన అధికారులకు సరైన సమాచారాన్ని అందించాలని మండల ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ముదిగుబ్బ పశు వైద్యాధికారి డాక్టర్ రామేశ్వరరావు, ప్రసాద్, వివిధ సచివాలయాల పశుసంవర్ధక సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE DISTRICT JUDGE: ANANTAPURAMU
I.A. No: 971/2024 in A.S. No: Nill/2024
Between:
1.Shaik Dada Javid and another
...Petitioners/Appellants
And
Gujjala Sreenivasulu and another
...Respondents/Respondents
Notice to Respondant No: 1 and 2.
R1: Gujjala Sreenivasulu S/o Late Gujjala Ganganna, Hindu, 47 years,Business, D.No:5-36, Malagundlapalli village, Dharmavaram mandal, Sri Satya Sai Dist.
R2: Chavva Bhaskar Reddy S/o Chinna Chenna Reddy, Hindu, 67 years, D.No:2-10, Chavvari Palli village, Simhadripuram mandal, Kadapa dist
పై నెంబరు కేసులో రెస్పాండెంట్లు అయిన మీ హాజరు నిమిత్తము 08-11-2024వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
A.Suresh Kumar,Advicate,
Ananthapuram Cell; 9440204098.

దీపం-2 పథకం కింద 5,36,289 మందికి లబ్ధి

కలెక్టర్ టిఎస్. చేతన్

గ్యాస్ ఏజెన్సీ వారితో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

జిల్లాలో దీపం-2 పథకం ద్వారా 5,36,289 గ్యాస్ కనెక్షన్లకు లబ్ధి చేకూరనుందని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సాయిఆరామం ఎదురుగా ఉన్న ప్రశాంతి గ్యాస్ ఏజెన్సీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారి వంశీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం పొందే విషయంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా అన్ని విధాల సహకరించాలని గ్యాస్ పంపిణీ దారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం దీపం-2 పథకం కింద అర్హులైన పేద కుటుంబాల వారికి సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేసేందుకు ఈనెల 31వ తేదీ నుండి శ్రీకారం చుట్టనుందన్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలో చురుకుగావున్న ఎల్‌పిజి కనెక్షన్, ఆధార్ నంబరు, బియ్యపు కార్డు, ఆధార్ నెంబర్‌తో అనుసంధానమైన బ్యాంకు ఖాతా నంబరు కలిగి ఉన్నవారు ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు పొందుటకు అర్హులన్నారు. ఈ పథకము దీపావళి పండుగ పురస్కరించుకొని ఈనెల 31వ తేదీ నుండి ప్రారంభం అవుతుందన్నారు. ఈ పథకం కింద ప్రయోజనం పొందే లబ్ధిదారులు వారి గ్యాస్ ఏజెన్సీ నందు గ్యాస్ కోసం బుకింగ్ చేసుకుని గ్యాస్ ధరను గ్యాస్ ఏజెన్సీ వారికి పూర్తిగా మొదట చెల్లించాలన్నారు. ఆ తరువాత అర్హులైన లబ్ధిదారులకు 2 రోజులలో వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా డిబిటి పద్ధతిలో జమ చేయబడుతుందన్నారు. ఈ పథకం కింద మొదటి ఉచిత గ్యాస్ సిలిండర్ పొందగోరు లబ్ధిదారులు 2025 సంవత్సరం మార్చి 31వ తేదీ వరకు వారి గ్యాస్ ఏజెన్సీ వద్ద బుకింగ్ చేసుకునే సదుపాయం ఉందన్నారు. మొదటి ఉచిత సిలిండర్‌కు బుకింగ్ చేసిన 24 నుండి 48 గంటల్లో లబ్ధిదారులకు సరఫరా చేయవలసి ఉంటుందన్నారు. ఈ పథకంపై ఏమైనా అభ్యంతరాలు గాని, సూచనలు గాని, సమస్యలు గానీ ఉంటే టోల్ ఫ్రీ నెంబరు 1967కు ఫోన్ చేసి తెలపవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సమిష్టిగా అడ్డుకట్ట వేద్దాం

ఎస్పీ వి.రత్న

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పోలీసులంతా సమిష్టిగా పనిచేసి జిల్లాలో నేరాలు నియంత్రణకు అడ్డుకట్ట వేద్దామని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ వి రత్న పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో హిందూపురం సబ్ డివిజన్ డీఎస్పీ, సిఐలు, ఎస్ఐలతో ఎస్పీ రత్న నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ హిందూపురం సబ్ డివిజన్‌లో దీర్ఘకాలంగా ఉన్న పెండింగ్ కేసుల గురించి సమీక్షించారు. పోలీసుస్టేషన్ల వారీగా కేసుల పెండింగ్‌కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను విచారించి త్వరగా పూర్తి చేయాలన్నారు. మర్డర్, మిస్సింగ్, ఫోక్సో, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులపై ఆరా తీశారు. బోర్డర్ చెక్‌పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నేరాల నియంత్రణకు గట్టి చర్యలు తీసుకోవాలన్నారు.పట్టణ సమీప ప్రాంతాలలో ఉన్న నివాసాల ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు.చోరీలు జరగకుండా రాత్రి వేళల్లో గస్తీలు ముమ్మరం చేసి పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. బ్యాంకులు, ఎటిఎంల వద్ద భద్రత చర్యలు చేపట్టి సీసీ కెమెరాలు లేని చోట వాటిని ఏర్పాటు చేయించే విధంగా చూడాలన్నారు. కేసులు నమోదు చేసే విషయంలో నిజ నిర్ధారణ చేసుకోవాలన్నారు. బాధితుడికి న్యాయం చేయాలన్నారు. ప్రాపర్టీ , ఛీటింగ్, సైబర్ ఫ్రాడ్స్ కేసులలో ఫిర్యాదులు వస్తే వెంటనే కేసులు నమోదు చేయాలన్నారు. జాతీయ రహదారులలో మలుపుల వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు నేర నివారణే ప్రథమ ధ్యేయంగా పోలీసులు పనిచేయాలన్నారు. ఈ నేర సమీక్ష సమావేశంలో ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు , డీఎస్పీ కేవీ మహేష్, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, ఏవో సుజాత ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, సిఐలు ఆంజనేయులు, రాజగోపాల్ నాయుడు, కరీం, జనార్దన్, డిటి, డిసిఆర్‌బి సిఐలు శ్రీనివాసులు సతీష్, గోపీనాథ్ రెడ్డి, ఎస్ఐలు మునీర్ అహ్మద్, నరేంద్ర, ఐటి కోర్ ఇన్‌ఛార్జి సుదర్శన్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల్లో 'మధ్యాహ్న భోజనం' ప్రారంభించాలి : ఎస్ఎఫ్ఐ

డిప్యూటీ తహశీల్దార్‌కి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ చార్జీలు రూ. 3 వేలకు పెంచాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ జగన్నాథ్‌కు బుధవారం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి మాట్లాడుతూ పేద మధ్యతరగతి కుటుంబాలకు సంబంధించిన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం మధ్యాహ్న భోజనం రద్దు చేసిందని తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పున ప్రారంభిస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీ మేరకు జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించాలని హాస్టల్ విద్యార్థులకు నిత్యావసరాలు ధరలు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 77ను రద్దుచేసి పీజీ చదివే ప్రతి విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపజేసేలా చూడాలని అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం వచ్చే విధంగా చూడాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు జగదీష్, సాయిరాం, సిఐటియు నాయకులు వెంకటేష్, రామచంద్ర, ఎస్ఎఫ్ఐ నాయకులు నందీష్, యోగేష్, విజయ్, చరణ్ తేజ, రోహిత్ రెడ్డి, కృష్ణ, కార్తీక్, ఇర్ఫాన్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల కడుపుకొట్టిన జగన్ : మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ నియోజకవర్గ కేంద్రంలో అన్న క్యాంటీన్ ప్రారంభించి బుధవారం నాటికి 500 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మంత్రి సవిత అన్నా క్యాంటీన్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఆదేశాలతో అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్నా పేదలకు అన్నం పెట్టాలని ఉద్దేశంతో 5 రూపాయలకే అన్న క్యాంటీన్ నిర్వహించామన్నారు. బుధవారానికి 500 రోజులు పూర్తి చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని మంత్రి అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే క్యాంటీన్లను మూసివేసి పేదల పొట్ట కొట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం శ్మశాన వాటికకు దారి సౌకర్యం కల్పించండి

గోరంట్ల రూరల్ :ముస్లిం శ్మశాన వాటికకు దారి సౌకర్యం కల్పించాలని ముస్లిం,మైనారిటీ సోదరులు మంత్రి సవితమ్మకు వినతిపత్రం సమర్పించారు. మండల పరిధిలోని వానవోలు గ్రామానికి చెందిన ముస్లిం,మైనారిటీ సోదరులు బుధవారం పెనుకొండలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంత్రిని కలిసి తమ సమస్యను వివరించారు. ఈకార్యక్రకమంలో మాజీ ఎంపిటిసి జిలాన్, మహమ్మద్ రఫీ, హిదయతుల్లా, అజ్జు తుల్లా, షబ్బీర్, మహమ్మద్ బాషా. రంగనాయకులు పాల్గొన్నారు.

అన్నాక్యాంటిన్‌లో భోజనం చేస్తున్న మంత్రి సవిత

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఉత్తరప్రదేశ్ వాసి మృతి

ప్రజాశక్తి - బత్తలపల్లి

అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని గుమ్మల్లకుంట బస్ స్టాఫ్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి నరమ్ (24) మృతిచెందాడు. గుమ్మల్లకుంట క్రాస్ వద్ద జాతీయ రహదారిపై అండర్ వైరింగ్ కంకర చేస్తున్న మిల్లర్(లారీ) రోడ్డు ప్రక్కన నిలిపి పనులు చేస్తున్నారు. ఇదే సమయంలో కదిరి వైపు నుంచి అనంతపురం వెలుతున్న కారు నిలిపి ఉన్న మిల్లర్‌ను వెనుక వైపు నుంచి ఢీ కొంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయింది. డ్రైవింగ్ చేస్తున్న నరమ్ కారులో ఇరుక్కుపోయాడు. వెంటనే స్థానికులు ట్రాక్టర్ సాయంతో నరమ్‌ను బయటకు తీసి 108 వాహనంలో ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నరమ్ మృతిచెందాడు. మృతుడు రిహాన్ ఎంటర్‌ప్రైజస్‌లో సూపర్‌వైజర్‌గా శిక్షణ పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఇతను ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని జానీ బజార్, మెయిన్ రోడ్డు మీరట్లో ఉంటున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సోముశేఖర్ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని కేతిరెడ్డి కాలనీలో నివాసం వుండే ఖాదర్ బాషా భార్య షేక్ నూర్జహాన్ (38) బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకుంది. సమాచారం తెలిసిన వెంటనే టూటౌన్ సిఐ రెడ్డప్ప సంఘటన స్థలాన్ని పరిశీలించారు. నూర్జహాన్ అనారోగ్యం కారణంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు.

అప్పులబాధతో వ్యక్తి...

ప్రజాశక్తి - నల్లచెరువు

మండల పరిధిలోని గాజే ఖాన్ పల్లికి చెందిన వ్యక్తి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన సురేష్ (40) ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పుల బాధ తాళలేక సురేష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆయన భార్య భారతి తెలిపారు మృతుడి భార్య భారతి ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తోంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కదిరిపూలకుంటలో మహిళ...

ప్రజాశక్తి- నల్లచెరువు

మండలంలోని కదిరి పూలకుంట గ్రామానికి చెందిన శారదమ్మ ఆత్మహత్యకు పాల్పఇంది. మంగళవారం ఇంటినుంచి వెళ్లిపోయిన శారదమ్మ బుధవారం బావిలో శవమై తేలిందని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక టిప్పర్లు పట్టివేత

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండల పరిధిలోని గరిశలపల్లి సమీపంలోని చిత్రావతి నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు జేసీబీలు, ఐదు టిప్పర్లను పోలీసులు సీజ్ చేశారు. బుధవారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న సీఐ ప్రభాకర్ వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సోమశేఖర్ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. గరిశలపల్లి వద్ద వాటిని పట్టుకొని స్టేషన్‌కు తరలించారు.

బాణసంచా దుకాణాల తనిఖీ

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని కర్నాటక నాగేపల్లి వద్ద ఏర్పాటుచేసిన బాణసంచా దుకాణాలను పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిఐలు సునీత, సురేష్ మాట్లాడుతూ దుకాణదారులు నిబంధనలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి అర్బన్ ఎస్ఐ శ్రీరాములు, రూరల్ ఎస్ఐ లింగన్న, మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ శివయ్య, పోలీసులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓబుళదేవర చెరువు :టపాసుల విక్రయదారులు నిబంధనలు పాటించాలని ఎస్ఐ మధుసూదన్ రెడ్డి ఆదేశించారు. ప్రమాదాలకు తావు లేకుండా, సరైన భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. లైసెన్స్ పొందిన వారు కేటాయించిన ప్రదేశంలోనే దుకాణం ఏర్పాటు చేసుకుని టపాసులు విక్రయించాలన్నారు.

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న టపాసుల విక్రయ కేంద్రాలను డీఎస్పీ శ్రీనివాసులు, సిఐ శ్యామరావు బుధవారం పరిశీలించారు. భద్రత ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ముదిగుబ్బ పోలీసులు పాల్గొన్నారు.

30 పడకల ఆసుపత్రి కోసం వినతి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల కేంద్రంలో 30 పడకల ఆసుపత్రి కోసం సిపిఎం నాయకులు ప్రభుత్వ వైద్యురాలు లిఖితకు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ముదిగుబ్బ మండలం పెద్ద మండలంఅని అన్నారు. ఈ నేపథ్యంలో 30 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలన్నారు. అలాగే 108 వాహనం సమకూర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేష్, -పోతలయ్య, మునాఫ్, వెంగముని, బాల వెంగముని తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవర చెరువు : మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాల భవనం పూర్తి నిర్వీర్యంగా ఉందని, కనీస సౌకర్యాలు కూడా లేకుండా ఆసుపత్రికి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండల కేంద్రంలో 30 పడగల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని సిపిఐ నాయకులు కోరారు. ఈ మేరకు వారు ఎమ్మెల్యే సింధూర రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు.

చట్టం దృష్టిలో అందరూ సమానమే

ప్రజాశక్తి - కొత్తచెరువు

చట్టం దృష్టిలో ప్రజలందరూ సమానమేనని తహశీల్దార్ నీలకంఠారెడ్డి, సిఐ ఇందిర తెలిపారు. మండల పరిధిలోని అప్పలవాండపల్లి ఎస్టీ కాలనీలో మారెమ్మ గుడి వద్ద సివిల్ రైట్స్‌డేను బుధవారం నిర్వహించారు ప్రతి నెల 30వ తేదీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కిరణ్, వీఆర్వో ఓబులేసు, సర్పంచి గీతాబాయి, మాజీ సర్పంచి కిష్టప్ప, డివిఎంసి మెంబర్ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండలంలోని సంకేపల్లిలో పోలీసులు పౌరుహక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముదిగుబ్బ సిఐ శ్యామ్ రావు ఆధ్వర్యంలో పోలీసులు గ్రామస్తులను సమావేశపరిచి పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

డిఇఒను కలిసిన పిఇటిలు

ప్రజాశక్తి - కొత్తచెరువు

డీఈవోగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కిష్టప్పను జిల్లా పీఈటీల సంఘం నాయకులు బుధవారం కలిశారు. జిల్లాలోని పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పీఈటీల సంఘం జిల్లా అధ్యక్షులు శివకుమార్, కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి రామకృష్ణ, వేణుగోపాల్, దివాకర్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- చిలమత్తూరు

పుట్టపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి ట్యాలెంట్ టెస్ట్‌లో మండలంలోని టేకులోడు గురుకుల విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. తమ పాఠశాలకు చెందిన స్పందన, చందన, సహిత్య రెండవ స్థానంలో నిలిచారని గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శోభారాణి తెలిపారు.ఈ మేరకు ఉపాధ్యాయులు, జెవివి నాయకులు అలీముల్లా ప్రతిభా విద్యార్థులను అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - బుక్కపట్నం

ఎస్సీ ఎస్టీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ సయ్యద్ షాబుద్దీన్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని బుచ్చయ్య గారి పల్లి ఆర్డీటీ స్కూల్‌లో సివిల్ రైట్స్ లో భాగంగా ఎస్సీ ఎస్టీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎస్సీ ఎస్టీ చట్టాలపై కలిగి అవగాహన కలిగి ఉండాలన్నారు. కుల వివక్షతను నిర్మూలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ మస్తాన్, డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు, వీఆర్వో రేవతి, పోలీసులు పాల్గొన్నారు.

తుది జాబితా సిద్ధం చేయాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అర్హులందరూ ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అలాగే జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలను రుణ సహాయాన్ని అందించి అన్ని విధాలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా పరిశ్రమలు , ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డిస్టిక్ ఇండస్ట్రీస్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్ కమిటీ డిఐఈపిసి) సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ నాగరాజు, ఏపీఐసీసీ జోనల్ మేనేజర్ సోనీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన పారిశ్రామికవేత్తలకు రుణాలు మంజూరు చేయాలన్నారు. ఇదివరకే పరిశ్రమల స్థాపనకు కేటాయించిన ప్లాట్లలో పరిశ్రమలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి వచ్చిన దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించి అర్హుల జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి ఇప్పటివరకు పరిశ్రమల శాఖ తీసుకున్న చర్యలపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సంబంధించిన అనుమతులు నిర్ణీత గడువులోగా మంజూరు చేసే దిశగా చర్యలు చేపట్టాలని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజును ఆదేశించారు. సింగల్ డెస్క్ పోర్టల్‌లో పెండింగ్ లో ఉన్న 9 పరిశ్రమలకు సంబంధించిన అనుమతులు మంజూరు చేయాలని సమావేశంలో తీర్మానించారు. సింగిల్ డెస్క్ పోర్టల్‌లో, ఒఆర్‌డబ్ల్యు పరిశ్రమల స్థాపన కోసం సంబంధిత విభాగాల నుండి 3914 ఆమోదాల జారీ కోసం వ్యవస్థాపకులు దరఖాస్తు చేసుకున్నారు. 3914లో 3854 ప్రతిపాదనలు ఆమోదించారు. సేల్ డీడ్ కోసం చేసిన ఐదు దరఖాస్తులను ఆమోదించారు .గోరంట్ల సమీపంలో బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్శిటీని సంప్రదించి, స్కిల్ సెంటర్‌ను ప్రారంభించడానికి అవకాశాలను తనిఖీ చేయాలని స్కిల్ డెవలప్మెంట్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డిఎం రమణ కుమార్, డిపిఒ సమత, కమిషనర్ ప్రహల్లాద, స్కిల్ డెవలప్మెంట్ అధికారి రాజేష్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివ రంగ ప్రసాద్ , కమిటీ సభ్యులు సుదర్శన్, చేనేటి అసనాపురం, డిక్కీ ప్రతినిధి వెంకటరమణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అపార్ కార్డుల జారీకి అడ్డంకులు తొలగించండి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అపార్‌కార్డుల జారీకి అడ్డంకులు తొలగించాలని ఎస్టియు నాయకులు కోరారు. ఈ మేరకు సంఘం నాయకులు బుధవారం శ్రీ సత్య సాయి జిల్లా నూతన విద్యాశాఖాధికారి క్రిష్టప్పను కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎస్ టి యు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరి ప్రసాద్ రెడ్డి, చంద్రశేఖర్ మాట్లాడుతూ అపార్ కార్డులు జారీ కోసం ఆధార్ సవరణ కేంద్రాలను జిల్లాలోని ప్రతి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని అపరిష్కృత ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన విద్యావిధానంలో భాగంగా "ఒన్ నేషన్ - ఒన్ స్టూడెంట్ ఐడి" పేరుతో దేశవ్యాప్తంగా విద్యార్థులకు ఒకే ఐడి క్రియేట్ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి అపార్ ఐడి కార్డులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ప్రతి విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, ఆధార్ కార్డు, అడ్మిషన్ రిజిస్టర్, యుడైస్ నందు ఒకేలా ఉన్నప్పుడే ఐడి క్రియేట్ అవుతుందని అన్నారు. అయితే ప్రతి పాఠశాలలో మెజారిటీ విద్యార్థులకు ఈ మూడింటిలో వివరాలు సరిపోలడం లేదన్నారు. వాటిని సవరించుకోవడానికి ఆధార్ సవరణ కేంద్రాలు అందుబాటులో ఉండటం లేదని తెలిపారు. అపార్ కార్డుల జారీకి క్షేత్రస్థాయిలో అడ్డంకులు ఎదురవుతున్నాయన్నారు. ప్రతి విద్యార్థికి ఇప్పటికే యూడైస్ నంబరు కేటాయించారని చాలామంది విద్యార్థుల సమాచారం పాఠశాలల రికార్డుల్లో ఒకలా... ఆధార్ కార్డుల్లో మరోలా ఉన్నాయని చెప్పారు. 15 శాతంలోపుగా మాత్రమే వివరాలు సరిపోలుతున్నాయన్నారు. ఆధార్ నమోదులోనే ఎక్కువ తప్పిదాలున్నాయని, తప్పిదాలను, సమస్యలను పరిష్కరించకుండా దీన్ని ప్రాధాన్య అంశంగా పరిగణించి కార్డులు జారీ చేయాలని ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి తీసుకురావడం సరైంది కాదని తెలిపారు. ప్రతి ఉన్నత పాఠశాలలో ఆధార్ సవరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, యుడైస్ నందు సవరణలను పాఠశాల స్థాయిలో ప్రధానోపాధ్యాయుల ద్వారా సవరించుకునేలా అవకాశం కల్పించాలని, సరైన ఆధారాలతో అడ్మిషన్ రిజిష్టర్లో వివరాలు సవరించుకోవడానికి అవకాశం కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్,ఆర్థిక కార్యదర్శి గోపాల్ నాయక్, మాజీ రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు ప్రసాద్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఆసిఫ్, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీప్రసాద్, సుధాకర్, జిల్లా కౌన్సిలర్లు . ప్రసాద్, రవిచంద్ర, సంపత్ కుమార్, వీర మహేశ్వర, సుందర సుకుమార్, కిష్టప్ప, శ్రీనివాసులు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం తగదు

శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే, మాజీ మంత్రి

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 50 లక్షలతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ సెంటర్ భవనాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, జిల్లా వైద్యాధికారిని మంజుల వాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ మార్పుల వల్ల వాడుతున్న ఆహారం నీటి పరిస్థితుల వల్ల అనేక జబ్బులు మనిషికి వస్తున్నాయని వాటి నిర్మూలనకు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచుకొని మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్ , డిఐఒ నాగేంద్ర నాయక్, ఓడి చెరువు మండల వైద్యాధికారులు భాను ప్రకాష్, కమల్ రోహిత్, ఆర్ అండ్ బి అధికారులు సంజీవయ్య, కంబగిరి స్వామి, టీడీపీ మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జెడ్పీటీసీ పిట్టా ఓబుల్ రెడ్డి, పీట్లా సుధాకర్, బోయపల్లి శివారెడ్డి, కాంట్రాక్టర్ లోకేశ్వర్ రెడ్డి, ల్యాబ్ టెక్నిషియన్ నరేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : మహిళల ఆర్థిక అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందనిఎమ్మెల్యే పల్లె సింధుర రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో ఏరియా కోఆర్డినేటర్ రవీంద్ర అధ్యక్షతన ఐకెపి మహిళలతో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మహిళలు జీవన ప్రమాణాలు పెంపొందించుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలని కోరారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు.

'ఎన్ఎస్‌పిఆర్' విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం

పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీసు శాఖ నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో జిల్లా స్థాయిలో ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ఆపాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి తెలిపారు. ప్రథమ స్థానం సాధించిన కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ప్రిన్సిపల్ బుధవారం కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె కళాశాలలో బీకాం (కంప్యూటర్ అప్లికేషన్) ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎ . మదీహా, యస్. సిరివల్లి కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లుగా కొనసాగుతూ ఇటీవల పోలీస్ శాఖ నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీలలో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం కళాశాలకే గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి. వెంకటేశులు, అధ్యాపకులు ఈ.శ్రీధర్, ఎస్.శ్రీలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ బి నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం : ఎస్పీ

కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ, మాజీ మంత్రి, తదితరులు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పోలీస్ అమరవీరుల త్యాగాలను మరవలేనివని జిల్లా ఎస్పీ వి. రత్న పేర్కొన్నారు. బుధవారం రాత్రి పుట్టపర్తి పట్టణంలోని పోలీసుల ఆధ్వర్యంలో హనుమాన్ సర్కిల్ వద్ద పోలీసు అమరవీరుల స్మరిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ వి.రత్న మాట్లాడుతూ అమరులైన పోలీసుల త్యాగాలను గుర్తించుకొని వారి సేవలను స్మరించుకుంటూ వారు చూపిన దారిలో ముందుకు నడవాలన్నారు. మన రాష్ట్రంలో బాబా వలి, చంద్రశేఖర్ ఇద్దరు పోలీసులు అమరులయ్యారని, వారోత్సవాల సందర్భంగా వారి కుటుంబాలను కలిసి గౌరవించడం జరిగిందని వారికి ప్రభుత్వ పరంగా రావాల్సిన సహాయ సహకారాలు కూడా అందించడం జరిగిందని అన్నారు. అమరులైన పోలీస్ త్యాగాలను మనమందరం గుర్తు చేసుకుంటూ చేపట్టిన కొవ్వొత్తుల ర్యాలీని విజయవంతం చేసినందుకు పుట్టపర్తి ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పోలీసుల అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఈనెల 21 నుండి 31 వరకు జిల్లా వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు పోలీసులు చేపట్టారని చెప్పారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ పోలీసులసేవలో అమోఘమని అమరులైన పోలీసులు అందరిని స్మరించుకోవాలని అన్నారు. అనంతరం హనుమాన్ సర్కిల్ నుండి పట్టణంలోని ప్రధాన రహదారి నుండి విద్యాగిరి ఆర్చ్ వరకు పోలీస్ బ్యాండ్ మధ్య, పోలీస్ అధికారులు సిబ్బంది, పట్టణ ప్రముఖులు ఆటో డ్రైవర్లు మహిళలు ప్రజలు పోలీసులు విద్యార్థులు, పట్టణ ప్రజలు కొవ్వొత్తులతో ర్యాలీగా పెద్ద ఎత్తున వెళ్లి విద్యా గిరి ఆర్చ్ వద్ద ఏర్పాటుచేసిన పోలీస్ అమరవీరులను స్మరిస్తూ కొవ్వొత్తుల ఉంచి పోలీస్ అమరవీరుల నివాళులర్పించారు. అనంతరం పోలీస్ అమరవీరుల జోహార్ అంటూ నినాదాలు చేశారు. పట్టణ పురవీధుల్లో కొవ్వొత్తుల ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఆర్డీవో సువర్ణ, అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, పుట్టపర్తి డిఎస్పి విజయ్ కుమార్, ఏఆర్ డీస్పీ విజయ్ కుమార్, ఎస్బి సిఐ,బాలసుబ్రమణ్యం రెడ్డి, ఎస్ఐ ప్రదీప్ కుమార్, సిఐలు సునీత, సురేష్, ఇందిర నరేందర్ రెడ్డి, ఆర్ఐలు వలి మహేష్, రవికుమార్, ఆర్ఎస్ఐలు వెంకటేశ్వర్లు ప్రదీప్ సింగ్, వీరన్న, ఎస్ఐలు ప్రజలు పాల్గొన్నారు.